
మామడ : రాశిమెట్లలో ప్రచారం చేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి


దిలావర్‌పూర్ : కాల్వలో ప్రచారం చేస్తున్న మంత్రి అల్లోల అల్లుడు రంజిత్‌రెడ్డి


లక్ష్మణచాంద : పార్‌పెల్లిలో ప్రచారం చేస్తున్న మంత్రి సోదరుడు సురేందర్ రెడ్డి

# మెడికల్ కళాశాల ఘనత మాదే..

- ఉన్న కాలేజీలను అమ్ముకున్నది మహేశ్వర్‌రెడ్డి
- ఎవరు కావాలో ప్రజలే ఆలోచించుకోవాలి
- నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి
- పట్టణంలో ఇంటింటా ప్రచారం..
- ఆయా మండలాల్లో బీఆర్ఎస్ నాయకుల ఓట్ల అభ్యర్థన

నిర్మల్ అర్బన్, నవంబర్ 19 : 'నిర్మల్ జిల్లాకు మెడికల్ కళాశాల తెచ్చిన ఘనత మనది.., ఉన్న కాలేజీలను అమ్ముకున్న ఘనత మహేశ్వర్‌రెడ్డిది.., ఎవరికి ఓటు వేస్తారో ప్రజలే ఆలోచించుకోవాలి..' అని నిర్మల్ నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ప్రజలకు సూచించారు. నిర్మల్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీ, గండి రామన్న, గాంధీనగర్, కచ్చి కాలనీ, కబూతర్ కమాన్ వార్డుల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీకి ఓటు వేస్తే ఓటు వృథా అవుతుందని, అభివృద్ధి చేసే నాయకులను గుర్తించి అమూల్యమైన ఓటును సరైన అభ్యర్థికే వేయాలని కోరారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరిస్తూ, నిర్మల్ నియోజకవర్గానికి ఆయన చేసిన అభివృద్ధిని వివరించారు. అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని, నియోజకవర్గాన్ని వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేశామన్నారు. ఇటీవలే నిర్మల్ మున్సిపాలిటీ రూ.200 కోట్లు మంజూరు చేశామని, అన్ని చోట్లా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ఒక పక్క జిల్లాను అభివృద్ధి చేసి, మెడికల్, నర్సింగ్ కళాశాలలను మంజూరు చేయిస్తే, గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా పని చేసిన మహేశ్వర్ రెడ్డి తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఇంజినీరింగ్ కళాశాలను హైదరాబాద్‌కు తీసుకెళ్లారని విమర్శించారు. ఇక్కడి విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేశాడని ఆరోపించారు. అభివృద్ధి కోసం ముందుకెళ్తున్న బీఆర్ఎస్ వెంటే ప్రజలు ఉన్నారని, రాష్ట్రంలో మరోసారి అభివృద్ధి ప్రధాతలకు ప్రజలు పట్టం కడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక బీజేపీ ఎంపీ నిర్మల్‌కు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, ఆ పార్టీకి కులాలు, మతాలను అడ్డం పెట్టుకొని ఓట్లు అడగడమే లక్ష్యమని విమర్శించారు.


నిర్మల్ అర్బన్ : పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నిర్మల్ నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

## చర్చీలను సందర్శించిన మంత్రి..

నిర్మల్ పట్టణంలోని గొల్లపేట్ కాలనీలోని లివింగ్ చర్చి, శారోస్ చర్చి, కొండాపూర్‌లోని ఎల్కలి చర్చి, గాజుల్‌పేట్ సీఎస్‌టీ చర్చిలను మంత్రి సందర్శించారు. అక్కడి వారిని కలిసి తనకు మద్దతు తెలపాలని, మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తాననికోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా..

నిర్మల్ అర్బన్, నవంబర్ 19 : గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్‌రెడ్డి క్లబ్ హౌస్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రభుత్వం గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి చేసిందని, మళ్లీ అధికారంలోకి రాగానే గీత కార్మికులకు బైకులను పంపిణీ చేస్తామన్నారు. కల్లు గీతవృత్తి కోసం ప్రత్యేక చట్టాలను తీసుకువస్తామని తెలిపారు. అనంతరం మంత్రి క్యాంప్ కార్యాలయంలో 34వ వార్డు నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వీ సత్యనారాయణ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి అమర వేణి నర్సాగౌడ్, పాకాల చంద్రశేఖర్ గౌడ్, నారాగౌడ్, గొల్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తి, మారుగొండ రాము తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకరణ్ రెడ్డిని గెలిపిద్దాం..

లక్ష్మణచాంద, నవంబర్ 19 : కారు గుర్తుకు ఓటు వేసి నిర్మల్ అభ్యర్థి ఇంద్రకరణ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిద్దామని బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జి మంత్రి సోదరుడు అల్లోల సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పార్‌పెల్లి, లక్ష్మణచాంద, తిర్‌పెల్లి, మల్లాపూర్ తదితర గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి, గడపగడపకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అభివృద్ధిని చూసి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కొరిపెల్లి కృష్ణారెడ్డి, నాయకులు గోవర్దన్, కేశం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి..

దిలావర్‌పూర్, నవంబర్ 19 : అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని మంత్రి అల్లుడు రంజీత్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని కాల్వ, కాల్వతండా, గ్రామాల్లో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. కాల్వ గ్రామంలో రూ.35 లక్షలతో శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయాన్ని నిర్మించారని, ఆలయ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ అధ్వర్యంలోని ప్రభుత్వం రూ.కోటితో వివిధ రకాల పనులను చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాల్వ ఆలయ చైర్మన్ మాహేశ్, మాజీ చైర్మన్ ఇప్ప నర్సారెడ్డి, చిన్నయ్య, బాబురావు, సీతారం, డింపుల్ తదితరులున్నారు. అలాగే న్యూలోలం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థి, మంత్రి అల్లోలను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కేసీఆర్ చెప్పిందంటే చేసే గొప్ప మనసున్న నాయకుడని గుర్తుంచుకోవాలని చెప్తూ ప్రచారం చేశారు.

## బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి..

మామడ, నవంబర్ 19 : బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి జరిగిందని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ అన్నారు. మండలంలోని పొన్కల్ గ్రామంలో ఆయన ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి, బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అనుముల భాస్కర్, మంత్రి సోదరుడు దేవేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కనీవనర్ గంగారెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, మోతె రాజన్న, జీ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

## రాశిమెట్లలో...

మండలంలోని రాశిమెట్ల గ్రామంలో డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ పాకాల చంద్రశేఖర్‌గౌడ్, సర్పంచ్ రాందాస్, నాయకులు రేఖ్యానాయక్, లింగు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి అండగా నిలుద్దాం..

నర్సాపూర్ (జీ), నవంబర్ 18 : నర్సాపూర్ (జీ) మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగుతున్నది. రాంపూర్ గ్రామంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అల్లుడు, నర్సాపూర్ (జీ) మండల బాధ్యులు సోలిపురం రంజిత్ రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ,. గ్రామాల్లో అభివృద్ధి ఇంకా కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోకు ప్రజల్లో ఎంతో ఆదరణ లభిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నవీన్, యూత్ ప్రెసిడెంట్ ప్రవీణ్, ఎంపీటీసీ నడిపొల్ల రవి, మండల మాజీ వైస్ ప్రెసిడెంట్ జీవన్ రావ్, మైనార్టీ ప్రెసిడెంట్ ఇర్ఫాన్, మండల జనరల్ సెక్రటరీ సూర నారాయణ, సక్కరి ముత్యం, ప్రణీత్ రాజు, సత్మాన్, రాములు, ప్రవీణ్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


దిలావర్‌పూర్ : న్యూ లోలంలో వృద్ధురాలికి మ్యానిఫెస్టోను చూపుతున్న నాయకులు


నర్సాపూర్ (జీ) : రాంపూర్ ప్రచారంలో పాల్గొన్న సోలిపురం రంజిత్‌రెడ్డి

# అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి


అమ్మవారిని దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస రావు

బాసర, నవంబర్ 19 : బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శాలువాతో సత్కరించి, అమవారి ప్రసాదం, ఆశీర్వచనాలు అందజేశారు.